# నమస్తే తెలంగాణ
# రంగారెడ్డి
I హైదరాబాద్, గురువారం 15 ఆగస్టు 2024 | RANGAREDDY




సమావేశంలో మాట్లాడుతున్న రంగారెడ్డి కలెక్టర్ శశాంక

**ప్రతి వారం విధిగా తనిఖీలు నిర్వహించాలి**
**రంగారెడ్డి కలెక్టర్ శశాంక**

## వసతి గృహాల్లో మౌలిక వసతులు కల్పించండి

రంగారెడ్డి, ఆగస్టు 14(నమస్తే తెలంగాణ) : వసతి గృహాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక అధికారులు చర్యలు తీసుకోవాలని రంగారెడ్డి కలెక్టర్ శశాంక ఆదేశించారు. బుధవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలోని వసతి గృహాల్లో ప్రతి వారం సంబంధిత అధికారులు తనిఖీ నిర్వహించాలన్నారు. తాగునీటి వసతి, విద్యార్థులకు అందుతున్న ఆహారం, మరుగుదొడ్ల సదుపాయానికి తగిన ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కాచిన నీటిని విద్యార్థులకు అందించాలని, విద్యార్థులకు సీజనల్ వ్యాధులు సోకకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తరచూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా వసతి గృహాల్లో ఉండి చదువుకుంటున్న విద్యార్థిని, విద్యార్థులకు హెల్త్ క్యాంపులు నిర్వహించాలని ఆదేశించారు. వసతి గృహాల్లో మరమ్మతులు చేయించాల్సిన కిటికీలు, డోర్లు, విద్యుత్ సరఫరా వంటి వాటికి అధిక ప్రాధాన్యత ఇస్తూ వెంటనే చేపట్టాలన్నారు. ఏమైనా సమస్యలు ఉన్నట్లయితే పంచాయతీ సెక్రటరీలు, లోకల్ బాడీస్ వారి సహకారంతో పనులు పూర్తి చేయాలన్నారు. వసతి గృహాల వార్డెన్లతో ప్రతి వారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి సమస్యలపై ఆరా తీయాలన్నారు. వసతి గృహాల్లో క్రమం తప్పకుండా పారిశుధ్యం చేపట్టాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, జిల్లా సంక్షేమ శాఖల అధికారులు రామారావు, రామేశ్వరీదేవి, నవీన్‌కుమార్‌రెడ్డి, సీపీవో సౌమ్య, పరిశ్రమల శాఖ అధికారి శ్రీలక్ష్మి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

### జ్వర పీడితుల గుర్తింపునకు ఇంటింటి సర్వే నిర్వహించాలి

మలేరియా, డెంగీ వంటి వ్యాధులు ప్రబలకుండా ఇంటింటి సర్వే నిర్వహించి జ్వర పీడితులను గుర్తించాలని రంగారెడ్డి కలెక్టర్ శశాంక వైద్య అధికారులను ఆదేశించారు. బుధవారం శివరాంపల్లిలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌ను కలెక్టర్ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. డాక్టర్లు అప్రమత్తత పాటించి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్య అధికారులను ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని రోగులతో కలెక్టర్ ముచ్చటించారు. వారికి అందుతున్న వైద్యం, మందుల గురించి అడిగి తెలుసుకున్నారు. ల్యాబ్ రూమును, ఫార్మసీ స్టోరును, డాక్టర్ల గదితోపాటు రోగులకు పరీక్షలు చేసే గదిని పరిశీలించారు. దవాఖాన పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. టెస్టులు నిర్వహించి వివరాలు రిజిస్టర్‌లో నమోదు చేయాలని సంబంధిత సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు. సీజనల్ వ్యాధుల నియంత్రణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ తనిఖీలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వర రావు, తహసీల్దార్ రాములు, డాక్టర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## స్వాతంత్ర్య దినోత్సవానికి ఘనంగా ఏర్పాట్లు

**ముస్తాబైన రంగారెడ్డి కలెక్టరేట్.. నేడు ఉదయం 10 గంటలకు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్న ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి**

రంగారెడ్డి, ఆగస్టు 14 (నమస్తే తెలంగాణ) : 78వ స్వాతంత్ర్య దినోత్సవాలకు రంగారెడ్డి జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం ముస్తాబైంది. వేడుకలకు ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై గురువారం ఉదయం 10 గంటలకు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన తర్వాత పోలీసు గౌరవ వందనాన్ని స్వీకరిస్తారు. అనంతరం జరిగే కార్యక్రమంలో స్వాతంత్ర దినోత్సవ సందేశంపై ప్రసంగిస్తారు. స్వాతంత్ర్య సమరయోధులకు సన్మానం, ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు ప్రశంసా పత్రాల పంపిణీ తదితర కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆహుతులను అలరించేలా సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. సంక్షేమ పథకాల స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఈ వేడుకల్లో రంగారెడ్డి కలెక్టర్ శశాంకతోపాటు వివిధ శాఖల అధికారులు పాల్గొననున్నారు.



# తిరస్కరణే పరిష్కారమా?

**రంగారెడ్డి జిల్లాలో భూ సమస్యల పరిష్కారంలో ఎడతెరగని జాప్యం నెలకొంటున్నది. ఫలితంగా తహసీల్దార్, ఆర్డీవో, కలెక్టర్ల వద్ద ఫైల్స్ పేరుకుపోతున్నాయి. వారం, పది రోజుల్లోనే పూర్తి చేయాలంటూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేస్తున్నప్పటికీ ఫైల్స్ మాత్రం అనుకున్న మేరలో ముందుకు కదలడం లేదు. రిజెక్ట్ చేస్తూ డ్యాష్ బోర్డ్‌ను క్లియర్ చేస్తున్నారు. దీంతో ప్రభుత్వం సైతం వాటన్నింటినీ పరిష్కారం కిందనే లెక్క చూపిస్తున్నది. రాష్ట్రంలోనే భూ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులు ఎక్కువగా రంగారెడ్డి జిల్లాలోనే ఉన్నాయి. ఇప్పటివరకు 1,07,754 దరఖాస్తులను అధికారులు వివిధ కారణాలతో తిరస్కరించారు. కేవలం 3,181 దరఖాస్తులకు మాత్రమే పరిష్కారం చూపించారు. దీంతో నిత్యం ప్రజలు కలెక్టరేట్‌తోపాటు ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తున్నది.**
**- రంగారెడ్డి, ఆగస్టు 14 (నమస్తే తెలంగాణ)**

- జిల్లావ్యాప్తంగా భూ సమస్యల దరఖాస్తులు 2,92,985
- అప్రూవ్ అయినవి 1,39,600.. ఇందులో తిరస్కరణకు గురైనవి 1,07,754
- వివిధ స్థాయిల్లో పెండింగ్‌లో ఉన్నవి 28,737 దరఖాస్తులు
- పరిష్కారమైనవి కేవలం 3,181 దరఖాస్తులే..
- రిజెక్ట్ చేస్తూ.. అప్లికేషన్ల సంఖ్యను తగ్గిస్తున్న అధికారులు
- అన్నదాతలకు కలుగని ఉపశమనం..
- కార్యాలయాల చుట్టూ తప్పని ప్రదక్షిణలు

### పరిష్కారం అంతంతే..

కాంగ్రెస్ ప్రభుత్వం చెబుతున్నదానికి.. ఆచరణలో చేస్తున్నదానికి పొంతన ఉండడం లేదు. భూ సమస్యలపై సమీక్షలు, సమావేశాలు నిర్వహించి త్వరితగతిన పరిష్కరించాలని ఊదరగొడుతున్నప్పటికీ.. నేటికీ చాలావరకు భూ సమస్యలు అపరిష్కృతంగానే ఉన్నాయి. కలెక్టర్, అదనపు కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్ల వారీగా అధికారాలను విభజించినప్పటికీ భూ సమస్యల పరిష్కారంలో వేగం అందుకోవడం లేదు. మ్యుటేషన్, సక్సేషన్, వారసత్వ మార్పిడి వంటి చిన్నచిన్న సమస్యలను సైతం పరిష్కరించలేకపోతున్నారు. తాము ఎప్పుడో రిపోర్టులు పంపామని, అంతా ఉన్నతాధికారుల చేతుల్లోనే ఉందంటూ తహసీల్దార్లు చేతులెత్తేస్తున్నారు. కొన్ని సమస్యలు పరిష్కరించే స్థాయిలో ఉన్నప్పటికీ కొంతమంది అధికారులు నిర్లక్ష్యం కనబరుస్తున్నారు. కొర్రీలు పెట్టి నానా ఇబ్బందులకు గురి చేస్తున్నారు. దీంతో పనులు వదులుకుని మరీ రెవెన్యూ కార్యాలయాల చుట్టూ నిత్యం ప్రజలు ప్రదక్షిణలు చేస్తున్నారు. ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్న ప్రజావాణికి భూ సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులే ఎక్కువగా వస్తున్నాయి. సమస్యల సత్వర పరిష్కారానికై స్పెషల్ డ్రైవ్ వంటి కార్యక్రమాలను చేపట్టినప్పటికీ ఆశించిన స్థాయిలో దరఖాస్తులకు పరిష్కారం లభించలేదు. భూ సమస్యలు పరిష్కారం కాక.. పాస్ బుక్కులు రాక ప్రభుత్వ సంబంధిత పథకాలకు దూరం కావాల్సి వస్తున్నదని జిల్లా రైతాంగం ఆవేదన వ్యక్తం చేస్తున్నది. ఇదేరీతిన కాలయాపన చేస్తే మరిన్ని ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉన్నదని వారు గగ్గోలు పెడుతున్నారు.

**ఆగస్టు 12 నాటికి జిల్లాలో భూ సమస్యల పరిష్కారం వివరాలు ఇలా..**

| మాడ్యుల్ | తిరస్కరణ | పెండింగ్ | పరిష్కారం |
|---|---|---|---|
| ఎన్ఆర్ఐ పీపీబీ | 367 | 71 | 18 |
| కోర్టు కేసు ఇన్టిమేషన్ | 17,022 | 580 | 366 |
| కోర్టు కేసు పీపీబీ | 3,465 | 982 | 85 |
| డేటా కరెక్షన్ | 4,656 | 13,785 | 1,326 |
| జీపీఏ | 3,477 | 104 | 61 |
| నిషేధిత జాబితా | 31,567 | 7,201 | 450 |
| ఖాతా మెర్జింగ్ | 287 | 22 | 03 |
| లాండ్ మేటర్ గ్రీవెన్స్ | 22,293 | 901 | 106 |
| నాలా డబ్ల్యూవో పీపీబీ | 850 | 201 | 56 |
| ఆర్గనైజేషన్ పీపీబీ | 04 | 04 | 07 |
| పెండింగ్ మ్యుటేషన్ | 15,407 | 2,670 | 373 |
| సక్సేషన్ | 6,239 | 805 | 268 |
| అర్బన్ ల్యాండ్ | 1,260 | 480 | 59 |
| ఇష్యూ ఆఫ్ పీపీబీ/నాలా | 860 | 431 | 03 |
| మొత్తం | 1,07,754 | 28,237 | 3,181 |

### అకారణంగా రిజెక్ట్..

పెండింగ్ దరఖాస్తులను తక్కువగా చేసి చూపించాలనే ఉద్దేశంతో అధికారులు డ్యాష్ బోర్డు క్లియర్ చేసే పనిలో పడ్డారు. చాలా వరకు దరఖాస్తులను అకారణంగా తిరస్కరిస్తున్నారు. జిల్లాలో భూ సమస్యలకు సంబంధించి ప్రజల నుంచి 2,92,985 దరఖాస్తులు రాగా.. వాటిలో 1,39,600 దరఖాస్తులను అధికారులు అప్రూవ్ చేశారు. అయితే వీటిలో తిరస్కరణకు గురైన దరఖాస్తులు 1,07,754 వరకు ఉన్నాయి. నిషేధిత జాబితాలో భూమి ఉన్నదని, టీఎం15 లేదా టీఎం 33 కింద దరఖాస్తు చేసుకోవాలని స్టేటస్‌లో చూపిస్తుండడంతో మళ్లీ మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సి వస్తున్నదని ప్రజానీకం ఆవేదన వ్యక్తం చేస్తున్నది. పెండింగ్ దరఖాస్తులను రిజెక్ట్ చేస్తూ దరఖాస్తుల సంఖ్యను అధికారులు తగ్గిస్తుండగా.. పరిష్కరించామని ప్రభుత్వ పెద్దలు గొప్పలు చెప్పుకుంటుండం విస్మయం గొలుపుతున్నది. ఆగస్టు 12 నాటికి తహసీల్దార్ లాగిన్‌లో 10,726 దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా.. ఆర్డీవో లాగిన్‌లో 6,406 దరఖాస్తులు, అడిషనల్ కలెక్టర్ లాగిన్‌లో 7,175 దరఖాస్తులు, కలెక్టర్ లాగిన్‌లో 3,930 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. పెండింగ్‌లో 28,237 దరఖాస్తులు ఉండగా.. ఇప్పటివరకు 3,181(11.27శాతం) దరఖాస్తులకు మాత్రమే పరిష్కారం చూపించగలిగారు.

## భారీ వాహనాల వల్ల సీసీ రోడ్డు ధ్వంసం

**పట్టించుకోని అధికారులు.. ప్రమాదానికి గురవుతున్న ద్విచక్రవాహనదారులు**

మొయినాబాద్, ఆగస్టు 14 : భారీ వాహనాలతో సీసీ రోడ్డు ధ్వంసమైంది. రోడ్డు సామర్థ్యానికి మించి భారీ వాహనాలు వెళ్లడం వల్ల సీసీ రోడ్డంతా పగుళ్లు ఏర్పడ్డాయి. దీంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతుండడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలోని సురంగల్ గ్రామ పెద్ద చెరువు కింద ఉన్న రోడ్డుకు ఎక్కడకక్కడ పగుళ్లు వచ్చాయి. చెరువు కట్ట కింద నల్ల మట్టి ఉండడం వల్ల బీటీ రోడ్డు వేస్తే తొందరగా పాడవుతుందని, గత ఏడాది కింద సుమారు రు.50 50 లక్షల వ్యయంతో 700 మీటర్ల సీసీ రోడ్డును వేశారు. ఈ రోడ్డుపై 10 టన్నుల నుంచి 30 టన్నుల సామర్థ్యం గల వాహనాలు మాత్రమే వెళ్లేందుకు అనుమతులు ఉన్నట్లు పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులు పేర్కొంటున్నారు. కానీ సుమారు 50 నుంచి 60 టన్నుల సామర్థ్యం గల వాహనాలు వెళ్లడం వల్ల రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. ద్విచక్ర వాహనాల టైర్లు రోడ్డు పగుళ్లలో చిక్కుకుని పడి ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా పంచాయతీరాజ్ అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు పనులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.



## బిల్లులు రాక ఆగమాగం

- రెండు నెలలుగా ఎదురుచూస్తున్న పాడి రైతులు
- కడ్తాల్ ఎంసీసీ పరిధిలో రూ.14 కోట్ల బకాయిలు
- దాణా, పశుగ్రాసం కోసం అప్పులు చేస్తున్న రైతులు

కడ్తాల్, ఆగస్టు 14 : వ్యవసాయానికి అనుబంధంగా పాడి పరిశ్రమపై ఆధారపడి మండలంలో ఎంతో మంది పాడి రైతులు జీవనోపాధి పొందుతున్నారు. వ్యవసాయంలో వచ్చే రాబడిపై నమ్మకం లేక రైతులు పాడిని నమ్ముకొని పశు పోషణను అభివృద్ధి చేసుకున్నారు. పాల ఉత్పత్తిలో కడ్తాల్ మండలం రాష్ట్రంలో మంచి పేరు తెచ్చుకున్నది. ప్రతి రోజూ పాల శీతలీకరణ కేంద్రానికి వివిధ గ్రామాల నుంచి పాలను తరలిస్తారు. విజయ పాల సేకరణ కేంద్రాల్లో పాలు పోసే రైతులకు 15 రోజులకోసారి బిల్లులు చెల్లించడం జరుగుతున్నది. కానీ రెండు నెలలుగా పాల బిల్లులు చెల్లించకపోవడంతో పాడి రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. సమయానికి బిల్లులు రాకపోవడంతో రైతులు ఆగమైపోతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పాల బిల్లులు సక్రమంగా రావడంలేదని రైతులు వాపోతున్నారు. పదిహేను రోజులకోసారి చెల్లించాల్సిన పాల బిల్లులను, రెండు నెలలకు ఒకే బిల్లు మాత్రమే చెల్లిస్తుండడంతో రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులను చెల్లించాలని మండల కేంద్రంలో పాడి రైతులు ఆందోళన చేసిన సందర్భాలు ఉన్నాయి.



విజయ పాల సేకరణ కేంద్రంలో పాలు పోస్తున్న పాడి రైతులు



పాలను రోడ్డుపై పారబోస్తూ నిరసన తెలుపుతున్న పాడి రైతులు (ఫైల్)

### నాలుగు వేల మంది రైతులకు బిల్లులు రావాలి

మండలంలో పాడిని నమ్ముకొని వేల మంది రైతులు జీవనోపాధి పొందుతున్నారు. పాలశీతలీకరణ కేంద్రానికి చల్లంపల్లి, మాడ్గుల, చంద్రధన, మన్యగూడ, జైత్వారం గ్రామాల్లోని రైతుల నుంచి సేకరించిన పాలను తరలిస్తారు. పాల శీతలీకరణ కేంద్రానికి ప్రతి రోజూ 63 వేల లీటర్ల పాలు వస్తాయి. దాదాపు నాలుగు వేల మంది పాడి రైతులకు చెల్లించాల్సిన బిల్లులు ఇప్పటివరకు రూ.14 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. పాల బిల్లులు సక్రమంగా రాకపోవడంతో రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. సమయానికి బిల్లులు చెల్లించకపోవడంతో పశుపోషణ భారమవుతున్నదని రైతులు లబోదిబోమంటున్నారు. పశువులకు దాణా, మందులకు, పశుగ్రాసానికి అప్పులు చేస్తున్నామని, పిల్లల చదువులకు ఫీజులు సైతం కట్టలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఖర్చులకు చేతిలో చిల్లిగవ్వ కూడా ఉండడంలేదని రైతులు బాధపడుతున్నారు. ఇప్పటికైనా విజయ డెయిరీ ఉన్నతాధికారులు స్పందించి పెండింగ్‌లో ఉన్న బిల్లులను చెల్లించాలని రైతులు కోరుతున్నారు.

### పాడి రైతుల బాధలు వర్ణనాతీతం..

విజయ డెయిరీలో పాలు పోసే రైతుల బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి. నేను ప్రతి రోజూ గ్రామంలోని విజయ డెయిరీ పాల సేకరణ కేంద్రంలో పాలు పోస్తాను. నాకు రెండు నెలల పాల బిల్లు రూ.1.40 లక్షలు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రభుత్వం పాల బిల్లులు సక్రమంగా చెల్లించకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నాం. 60 రోజులుగా బిల్లులు రాకపోవడంతో పశుపోషణ భారంగా మారింది. బిల్లుల చెల్లింపులో జాప్యం చేయడం ప్రభుత్వానికి తగదు.
– బాచిరెడ్డి రవీందర్‌రెడ్డి, పాడి రైతు, కడ్తాల్ మండలం



### పాల బిల్లులు వెంటనే చెల్లించాలి

నిత్యం విజయ డెయిరీ పాల సేకరణ కేంద్రంలో పాలు పోస్తాను. నాకు రెండు నెలల రూ.1.50 లక్షల బిల్లు పెండింగ్‌లో ఉన్నది. సమయానికి బిల్లులు రాకపోవడంతో దాణా, గడ్డికి అప్పులు చేస్తున్నా. డబ్బులు లేకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారింది. ప్రభుత్వం పాడి రైతులను చిన్నచూపు చూస్తున్నది. బీఆర్ఎస్ పాలనలో పాల బిల్లుల విషయంలో ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి పాడి రైతుల బాధలు పెరిగాయి.
– ఎగిరిశెట్టి దశరథం, పాడి రైతు, కడ్తాల్ మండలం



## పల్లెల ప్రగతితోనే రాష్ట్రాభివృద్ధి

**కొడంగల్ మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్**

కొడంగల్, ఆగస్టు 14 : దేశానికి పట్టుగొమ్మలు పల్లెలు ప్రగతిలో ముందుకెళ్తేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని వికారాబాద్ ప్రతీక్ జైన్ అన్నారు. బుధవారం మండలంలోని చిట్లపల్లి, టేకల్‌లోకడ్, హుస్సేన్‌పూర్ గ్రామ పంచాయతీ భవనాలను కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డితో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీలపై ప్రత్యేక దృష్టి సారించిందని, రూ.20 లక్షల వ్యయంతో నూతన పంచాయతీల భవన నిర్మాణాలను చేపట్టి ప్రారంభించుకోవడం జరిగిందన్నారు. గ్రామ ప్రజలకు పూర్తి పాలన అందించేందుకు పంచాయతీ భవనాలు అవసరమని, సమస్యలుంటే పరిష్కరించుకోవచ్చన్నారు. అనంతరం మున్సిపల్ పరిధిలోని బాలాజీనగర్ వీధిలో పాఠశాల భవన నిర్మాణం కోసం ఎస్‌డీఎఫ్ ఫండ్ నుంచి రూ.70 లక్షల అంచనా వ్యయంతో భవన నిర్మాణం చేపట్టేందుకు శంకుస్థాపన చేశారు. జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో జరుగుతున్న అమ్మ ఆదర్శ పాఠశాల పేరుతో చేపడుతున్న మరమ్మతు పనులను పరిశీలించారు. పనులను త్వరితగతిన పూర్తి చేయించాలని అధికారులను ఆదేశించారు. పాఠశాలల పరిసరాలు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, విద్యార్థులు మధ్యాహ్న భోజన సమయంలో శుభ్రత పాటించేలా చూడాలన్నారు. అనంతర నూతనంగా ప్రారంభించిన గ్రామ పంచాయతీ భవన ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో కడ ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు కటకం శివకుమార్, మున్సిపల్ కమిషన్ బలరాం నాయక్, ఎంపీడీవో ఉషశ్రీ, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఉషరాణి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంత్, మాజీ ఎంపీటీసీ ఏన్గుల భాస్కర్, మాజీ సర్పంచ్ వెంకట్‌రెడ్డి, మున్సిపల్ మేనేజర్ ఆంజనేయులు, పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు మురళీధర్‌తో పాటు అయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

### మౌలిక సదుపాయాలకు పెద్దపీట..

బొంరాస్‌పేట : గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేసిందని కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. బుధవారం మండలంలోని లింగంపల్లి, నాందర్పూర్, కొత్తూరు గ్రామాల్లో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాలను, పల్లె దవాఖానను కలెక్టర్ ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం పల్లెల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. పంచాయతీ భవనాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కొడంగల్ కాంగ్రెస్ ఇన్‌చార్జి తిరుపతి రెడ్డి, కడ ప్రత్యేకఅధికారి వెంకట్‌రెడ్డి, ఎంపీడీవో వెంకన్‌గౌడ్, ఎంపీవో మహేష్, కాంగ్రెస్ నాయకులు నర్సింహులు గౌడ్, రాంచంద్రా రెడ్డి, రాజేశ్‌రెడ్డి పాల్గొన్నారు.



బాలాజీనగర్ పాఠశాలను పరిశీలిస్తున్న వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్